

శంకరపట్నం: ధర్మారంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ధర్మారంలో రసమయిని భుజాలపై ఎత్తుకుని అభిమానం చాటుకుంటున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

# అభివృద్ధి నిరోధకులెవరో ఆలోచించాలి

- కాంగ్రెస్‌కు అభివృద్ధిపై ధ్యాస లేదు
- ఆ పార్టీని నమ్మితే అధోగతే
- అడగకుండానే వరాలిచ్చే దేవుడు సీఎం కేసీఆర్
- ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తాం
- నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి
- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- రసమయికి అడగడుగునా నీరాజనం

శంకరపట్నం, నవంబర్ 2: 'అభివృద్ధి చేస్తుందెవరో.. అభివృద్ధి నిరోధకులెవరో ప్రజలు ఆలోచించాలి.. తెలంగాణలో ఉన్నన్నీ పథకాలు ఏ రాష్ట్రంలో లేవు.. అడగకుండానే వరాలిచ్చే దేవుడు సీఎం కేసీఆర్.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినం.. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు.. కారు గుర్తుకు ఓటేసి విజయాన్ని కట్టబెట్టాలి' అని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలను అభ్యర్థించారు. ప్రతీ గ్రామంలో అన్ని కులాలకు కమ్యూనిటీ భవనాలతో పాటు దాదాపు 90 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని గుర్తు చేశారు. గురువారం శంకరపట్నం మండలంలోని రాజాపూర్, కన్నాపూర్, ధర్మారం గ్రామాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రసమయి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడారు. ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతికేలా చేసిన ఏకైక నాయకుడు కేసీఆరే అన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేస్తే ఒంటరి, వితంతు మహిళలతో సహా ఆసరా పింఛన్లను ₹5016కు పెంచుతామన్నారు. 20–57 ఏండ్ల మహిళలందరికీ ₹3000 పింఛన్ అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మిని ₹2,00,116కు పెంచనున్నట్లు వెల్లడించారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి ₹5 లక్షల బీమా ఇస్తామని తెలిపారు. ₹400కే వంట గ్యాస్, రైతుబంధును ఎకరాకు ₹10 వేల నుంచి ₹16 వేలకు పెంచనున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో దళితబంధు అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. గృహలక్ష్మిలో భాగంగా రూ.3 లక్షలు అందజేస్తామన్నారు. అర్హులైన బీసీలకు బీసీబంధు కొనసాగిస్తామన్నారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ అభివృద్ధిపై ధ్యాస పెట్టలేదని దుయ్యబట్టారు. ఇప్పుడు కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే తిరిగి 60 ఏండ్లు వెనకకు వెళ్తామని హెచ్చరించారు. గ్రామాల్లో రసమయికి డప్పులు, కోలాటాలతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కన్నాపూర్‌లో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రచారంలో జడ్పీటీసీ ఎల్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, సర్పంచులు పిన్‌రెడ్డి వసంత, కాటం వెంకటరమణారెడ్డి, చుక్కల రవి, ఎంపీటీసీలు మోతె భాగ్యలక్ష్మి, మాతంగి లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ సంజీవరెడ్డి, సీనియర్ నాయకుడు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు అలీమొద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మవద్దు
- మరోసారి ఆశీర్వదించండి
- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

భీమదేవరపల్లి, నవంబర్ 2: బీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి మరింత సాధ్యమని హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మండలంలోని కొప్పూరు, రత్నగిరి, గాంధీనగర్, మాణిక్యాపూర్, వంగర, రంగయ్యపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రాన్ని ప్రగతిబాటన నడిపించింది కేసీఆర్ మాత్రమేనన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ఏదో ఒక సంక్షేమ పథకం ప్రతి పేదోడి ఇంటికి చేరిందని తెలిపారు. రాష్ట్రం రాకముందు గ్రామాలు ఎలా ఉన్నాయో, ఎలాంటి బాధలు పడ్డామో మీకు తెలియదా అని ప్రశ్నించారు. రాష్ట్రం సిద్ధించాక పల్లెలన్నీ ప్రగతిబాటన పయనిస్తున్నాయని వెల్లడించారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, డంప్‌యార్డు, రైతువేదిక, వైకుంఠ థామం, నర్సరీలు ఉన్నాయని చెప్పారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులన్ని తోడుకున్నాం.. ప్రతీ చెరువు నిండుకుండలా నిండి భూగర్భజలాలు పెరిగాయని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతుబీమా, రైతుబంధు, నవ వధువులకు కళ్యాణలక్ష్మి, బాలింతలకు కేసీఆర్ కిట్, 24గంటల విద్యుత్ సరఫరా, వృద్ధాప్య, వితంతు, వికలాంగులతోపాటు ఒంటరి మహిళలు, డయాలసిస్ రోగులకు సైతం పింఛన్లు అందజేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన తనను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

### హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్: పెద్దిరెడ్డి

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్ మూడోసారి సీఎం అవుతారని, హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ హుస్నాబాద్, హుజూరాబాద్ నియోజకవర్గాల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను గెలిపిస్తే పరోక్షంగా తనను కూడా గెలిపించినట్లేనని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలతో ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తారని, వారితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కారు గుర్తుకు ఓటేసి సతీశ్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత, జడ్పీటీసీ వంగ రవి, సర్పంచులు గద్ద రాజమణి, తాళ్లపల్లి తులసమ్మ, వెల్పుల రవి, వంగ సురేశ్, ఆలూరి రజిత, యామ వెంకటరాములు, ఎంపీటీసీలు సాతూరి రమ, కొత్తకొండ లలిత, నల్ల కౌసల్య, షరీపొద్దీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి, నాయకులు మాక లాజరస్, దార్న శ్రీనివాస్, ఎల్తూరి ప్రభాకర్, గద్ద సమ్మయ్య, గడ్డం వెంకన్న, సాతూరి ఆంజనేయులు, చీకట్ల జ్యోతి, గొల్లెన బాలమణి, శనిగరం సదానందం, తాళ్ళపల్లి కుమార్, రచ్చ సంపత్, కండె సంజీవ్, కండె సుధాకర్, అంబాల చక్రపాణి పాల్గొన్నారు.



భీమదేవరపల్లి మండలంలో ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్



భీమదేవరపల్లి మండలంలో ప్రచారంలో భాగంగా కొప్పూరులో జై బీఆర్ఎస్ అంటూ నినదిస్తున్న ప్రజలు

# పురమల్ల శ్రీనివాస్ బైండోవర్

రాంనగర్, నవంబర్ 2 : కాంగ్రెస్ నుంచి కరీంనగర్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్‌ను గురువారం పోలీసులు రూరల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నేర చరిత్ర ఉన్న వారిని పోలీసులు ఎప్పటికప్పుడు బైండోవర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కరీంనగర్ రూరల్ పోలీసులు కాంగ్రెస్‌కు చెందిన పురమల్ల శ్రీనివాస్‌తో వివిధ పార్టీలకు చెందిన మరో పది మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. పురమల్ల శ్రీనివాస్ ప్రస్తుతం బొమ్మకల్ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఆయన కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో సివిల్, క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్న శ్రీనివాస్‌ను పోలీసులు బైండోవర్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల్లో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా పోలీసులు వివిధ పార్టీల కార్యకర్తలను, నాయకులను బైండోవర్ చేయడం సర్వసాధారణమే అయినా ఒక ప్రధాన పార్టీ నుంచి అసెంబ్లీకి పోటీ చేసేందుకు టికెట్ రేస్‌లో ఉన్న బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ కూడా వీరిలో ఉండడమే చర్చకు దారితీస్తోంది. భూ వివాదాల్లో గతంలో అనేక సార్లు జైలుకు వెళ్లి వచ్చిన శ్రీనివాస్ ఇప్పుడు ప్రధాన రాజకీయ పార్టీ నుంచి టికెట్ ఆశించడం కూడా ఇక్కడ ప్రధాన అంశంగా చెప్పవచ్చు. కాగా, శ్రీనివాస్‌పై గతంలో నమోదైన కేసుల విషయంగానే పిలిచి బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

# బీఆర్ఎస్‌పై రైతు ప్రేమ



బూరుగుపల్లిలో రైతు మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న సుంకె రవిశంకర్

- నామినేషన్ ఖర్చుకు ₹5 వేల అందజేత
- కేసీఆర్‌తోనే రైతు సంక్షేమం సాధ్యమన్న రైతు మల్లారెడ్డి
- కృతజ్ఞతలు తెలిపిన చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్

గంగాధర, నవంబర్ 2: బీఆర్ఎస్‌పై తనకు ఉన్న ప్రేమను చాటుకున్నాడో రైతు. కేసీఆర్ ప్రభుత్వం ఉంటేనే రైతులకు మంచి జరుగుతుందని, వ్యవసాయం బాగుంటుందని, రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వమే మళ్లీ రావాలని కోరుకుంటున్నాడు. ఎమ్మెల్యే నామినేషన్ ఖర్చుల కోసం ₹5 వేలను అందజేసి తన సంతోషాన్ని పంచుకున్నాడు. గంగాధర మండలం రంగరావుపల్లి గ్రామానికి చెందిన నిమ్మ మల్లారెడ్డికి గ్రామ శివారులో మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కాగా మల్లారెడ్డి గురువారం బూరుగుపల్లిలోని ఎమ్మెల్యే రవిశంకర్ నివాసానికి వచ్చాడు. కేసీఆర్ ప్రభుత్వం పనితీరును ఎమ్మెల్యేతో పంచుకున్నాడు. రైతుబంధు కింద యేడాదికి ₹15 వేలు పెట్టుబడి అందజేస్తున్నట్లు, తనకు ₹లక్ష రుణ మాఫీ అయినట్లు రైతు మల్లారెడ్డి తెలిపాడు. కేసీఆర్ సర్కారు వచ్చినంకనే వ్యవసాయం బాగుపడ్డదని, బీడు భూములు సాగులోకి వచ్చి రైతులు సంతోషంగా ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. 24 గంటల కరెంటు, చెరువులు, బావుల్లో 365 రోజులు పుష్కలంగా నీరు, వ్యవసాయానికి రైతుబంధు పెట్టుబడి, రైతుబీమాతోని రైతు కుటుంబాలకు ₹5 లక్షల భరోసాను బీఆర్ఎస్ సర్కారు ఇస్తోందని తన సంతోషాన్ని ఎమ్మెల్యే రవిశంకర్‌తో పంచుకున్నాడు. ఎమ్మెల్యే రవిశంకర్‌కు ₹5వేలు అందజేసి నామినేషన్ వేయడం కోసం డబ్బును వినియోగించాలని కోరాడు. కాగా రైతు మల్లారెడ్డికి ఎమ్మెల్యే రవిశంకర్ కృతజ్ఞతలు తెలిపాడు. మల్లారెడ్డి కోరిక మేరకు నామినేషన్ కోసం ఖర్చు చేస్తానని ఎమ్మెల్యే చెప్పాడు.

# పథకాలకు ఆకర్షితులయ్యే చేరికలు



బూరుగుపల్లిలో బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- పార్టీలో చేరిన కురిక్యాల యువత

గంగాధర, నవంబర్ 2: కాంగ్రెస్, బీజేపీ నాయకులు తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం గంగాధర మండలంలోని కురిక్యాల గ్రామానికి చెందిన వంద మంది యువకులు సుంకె రవిశంకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడారు. గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని, ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతంపై మమకారం ఉండదని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తానని, కారు గుర్తుకు ఓటేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు